

మృత్యు ప్రయాణం

- 44వ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం
- కాలిబూడిదైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- 19 మంది సజీవ దహనం

అర్ధరాత్రి దాటాక 3 గంటలకు నిద్రలో ఉన్న వారిపై మృత్యువు నిప్పుల రూపంలో విరుచుకుపడిన హృదయవిదారకర ఘటన అది. కర్నూలు సమీపంలో జరిగిన ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదం మొత్తం ప్రాంతాన్ని భీతావహ వాతావరణంలో ముంచెత్తింది. హైదరాబాద్-బెంగళూరు 44వ జాతీయ రహదారి పక్కన కాలి బూడిదైన ఆ బస్సు కేవలం ఇనుప అస్థిపంజరంలా మిగిలిపోయింది. మంటల ఉధృతికి నిస్సత్తువగా వంగిపోయిన దాని ఆకారం, లోపల జరిగిన ఘోరాన్ని చెప్పకనే చెబుతోంది. ప్రమాదం జరిగిన సమయంలో 43 మంది ప్రయాణికులతో నిండిన ఆ బస్సులో 19 మంది నిద్రలోనే అగ్నికి ఆహుతయ్యారు. కాలిపోయిన వస్తువులు, భయానకర దృశ్యాలు ఆ ప్రాంతమంతా కనిపించాయి. భయంకరమైన ప్రమాదం నుంచి తప్పించుకున్న కొద్దిమంది ప్రయాణికులు కాలిన గాయాలతో, నిస్సత్తువతో, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసిన ఆ క్షణాలను తలచుకొని వణికిపోతున్నారు. అంధకారంలో, మంటల మధ్య సహాయం కోసం వారు వేసిన కేకలు ఇంకా గాలిలో ప్రతిధ్వనిస్తున్నట్లుగా అనిపిస్తోంది. కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ దుర్ఘటన తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది....



ప్రమాదంలో మృతి చెందిన నెల్లూరు జిల్లా రమేష్, కుటుంబ సభ్యులు (ఫైల్)



ప్రమాదంలో కాలిబూడిదయిన ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు ఎసి స్లీపర్ బస్సు కర్నూలు జిల్లాలోని కల్లూరు మండలం చిన్న టేకూరు దాటిన తరువాత కాలి బూడిదైంది. ఎన్‌హెచ్44పై వెళ్తున్న ఈ బస్సు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేసే సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్ర వాహనంపై కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్తున్న కర్నూలు ప్రజానగర్‌కు చెందిన శివశంకర్ (21) ఎగిరి రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం ప్రయివేటు బస్సు కిందకు వచ్చి ఇరుక్కుంది. 300 మీటర్లు బస్సు ద్విచక్రవాహనాన్ని రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. రోడ్డుకు, ద్విచక్రవాహనానికి మధ్య రాపిడి ఏర్పడటంతో నిప్పు రవ్వలు వచ్చి తొలుత ద్విచక్రవాహన పెట్రోల్ ట్యాంకుకు నిప్పంటుకుంది. తరువాత ఆ మంటలు బస్సుకు వ్యాపించాయి. బస్సు ముందు భాగంలో పొగ, అగ్గి రావడం గమనించిన కొందరు ప్రయాణికులు అప్రమత్తమై బస్సు అద్దాలను పగలగొట్టుకుని బయటకు దూకేశారు. అంతలోనే మంటలు ఎక్కువ కావడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సులోనే మిగిలిన 19 మంది సజీవ దహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌లో ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే బస్సు దాదాపుగా కాలి బూడిదైంది. క్షతగాత్రుల్లో 12 మందిని కర్నూలు జిజిహెచ్‌కు తరలించారు. వారిలో ప్రమాద సమయంలో బస్సులో 39 మంది పెద్దలతో పాటు నలుగురు చిన్నారులు ఉన్నారు. వారిలో 23 మంది పెద్దలు, ఇద్దరు చిన్నారులు సురక్షితంగా బయటపడ్డారు. మరణించిన వారిలో 17 మంది పెద్దలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఉదయం 11.30 గంటలకు బస్సులో నుంచి 19 మృతదేహాలను వెలికితీశారు. బస్సులో కాలిబూడిదైన వారిలో ఎపికి చెందిన ఆరుగురు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్ణాటకకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, బీహార్, ఒడిసాకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. మృతుల్లో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మృతదేహాలు కాలి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో డిఎన్‌ఎ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ప్రమాద స్థలాన్ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రులు వైద్యులను ఆదేశించారు. మంత్రుల వెంట డిఐజి కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, ఇతర ప్రజా ప్రతినిధులు ఉన్నాయి. ఈ ఘటనపై ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక డ్రైవర్ శివ నారాయణను అరెస్టు చేసి విచారిస్తున్నారు. మరో డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్య పరారీలో ఉన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, డిఐజి, ఎస్పీ తదితరులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న హోంమంత్రి వంగలపూడి వనిత, డిఐజి ప్రవీణ్ కోయ తదితరులు

ఆ కుటుంబం ఆశలు ఆవిరి

నెల్లూరు జిల్లా వింజమూరు మండలం, గోళ్లవారిపల్లె గ్రామానికి చెందిన గోళ్ల మాలకొండయ్య, సుశీల దంపతుల కుమారుడు గోళ్ల రమేష్ బతుకుదెరువు కోసం బెంగుళూరు వెళ్లారు. అక్కడే చిన్నపాటి ఉద్యోగం చేస్తూ..తన భార్య, పిల్లలను పోషించుకోవడంతోపాటు, సొంత ఊర్లో ఉన్న తల్లిదండ్రులకు బాసటగా నిలుస్తున్నారు.. ఇటీవల దసరాకు భార్య పిల్లలతో, ఊరికెళ్లి స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువులు, అత్మీయులతో ఆనందంగా గడిపారు. స్నేహితుడి కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగి మళ్లీ బెంగుళూరు వెళుతోన్న సమయంలో అగ్ని ప్రమాదం ఆ కుటుంబాన్ని అగ్నికి ఆహుతి చేసింది. గోళ్ల రమేశ్ (35) భార్య అనూష(30), కుమారుడు శశాంక్ (12), కుమార్తె మాన్యత (10) ఆ నలుగురూ దుర్మరణం చెందారు.

రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

- అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం డిమాండ్

కర్నూలు జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దటేకూరు గ్రామం వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం దిగ్భ్రాంతిని కలగజేసిందని, సిపిఎం జిల్లా నాయకులు వెల్లడించారు. ఘటన ప్రాంతాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకష్ణ, ఎండి.ఆనంద్ బాబు, టి.రాముడు, ఎండి.అంజి బాబు, జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, ఎం.రంగప్ప పరిశీలించి, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. గౌస్ దేశాయి, ఆనంద్ బాబు మాట్లాడుతూ ప్రైవేట్ బస్సుల పర్మిట్లు ముగుస్తున్న అధికారులకు పట్టడం లేదని, కాసులకు కక్కుర్తి పడి ఎలాంటి తనిఖీలు లేకుండానే ప్రయివేట్ బస్సులకు అనుమతులు ఇస్తున్నారన్నారు. చనిపోయిన తర్వాత ప్రజాప్రతిని ధులు, అధికారులు హడావుడి చేసి కంటితుడుపు మాటలు మాట్లాడడం కాకుండా, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. 2025 మార్చి నాటికి బస్సు పర్మిట్ పూర్తి అయి, 2024 నాటికి ఇన్సూరెన్స్ పూర్తయినా, బస్సును నడిపిస్తున్నారని అంటే ప్రైవేట్ యాజమాన్యాలతో పాలకులు ఎలాంటి లాలూచీ ఒప్పందాలు చేసుకుంటున్నారో దీన్ని బట్టి అర్థమవుతుందన్నా రు. 2018లో డామన్ అండ్ డయ్యులో రిజిస్ట్రేషన్ చేసుకున్న బస్సు తిరిగి 2025లో ఒడిశాలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు, 16 చోట్ల ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి 23 వేల పైన చలానా ఉన్నట్లు చూపిస్తున్నా బస్సును అలానే తిప్పిస్తున్నారని, ఇది ప్రభుత్వాల చేతగానితనానికి నిదర్శనం అన్నారు. చనిపోయిన ప్రతి బాధిత కుటుంబానికి కావేరి బస్సు యాజమాన్యం తరపున 50 లక్షలు ప్రభుత్వం తరఫున 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రమాదం నుండి బయటపడ్డ బాధితులకు మెరుగైన వైద్యం అందించి, 10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఘటనా స్థలాన్ని సందర్శిస్తున్న సిపిఎం నాయకులు గౌస్‌దేశాయ్, తదితరులు

సిఎం చంద్రబాబు ఆరా..!

- గాయపడిన వారికి మెరుగైన వైద్యం
- జిల్లా కలెక్టర్ కు సిఎం ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరికి శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతూ గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతదేహాలకు వైద్య పరీక్షలు నిర్వహించి వెంటనే వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆదేశించారు. తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బస్సు ప్రమాదం పట్టణపై పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. మంత్రి టిజి. భరత్ కూడా జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.



ముఖ్యమంత్రి ఫోన్‌లో పంపిన సందేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన బైకును కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు శివశంకర్ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. కర్నూలు మండలం తాండ్రపాడు సమీపంలోని ప్రజా నగర్ కు చెందిన శివశంకర్ రాత్రి ఏడున్నర గంటల సమయంలో డోన్‌లోని తన స్నేహితుని వద్దకు వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి తన పల్సర్ బైక్‌పై బయలుదేరారు. అయితే రాత్రి మూడు గంటల ప్రాంతంలో చిన్నటేకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం శివ శంకర్ మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన శివశంకర్




కోటసంతకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ఆపాలి

ప్రజాశక్తి- వెల్దుర్తి

వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమం వేగంగా కొనసాగుతోంది. ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడేందుకు వైసిపి ఈ పోరాటాన్ని ప్రజలతో కలిసి జరుపుతోంది. ఈ క్రమంలో పత్తికొండ పట్టణంలో ఈనెల 28న నిర్వహించనున్న ప్రజార్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డితో కలసి ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ కాలంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచితవైద్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేయబడ్డాయని, కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజల వైద్య హక్కులను దెబ్బతీయాలని చూస్తోందని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వవైద్య సేవలను బలహీనపరచి, ప్రైవేటు దళాలకు అప్పగించాలనే ప్రయత్నం ప్రజలకు అన్యాయం అని పేర్కొన్నారు. ఈ ప్రజా ఉద్యమ ర్యాలీలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పత్తికొండ నియోజకవర్గం జడ్పిటిసిలు, రాష్ట్ర కమిటీ నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, ఎంపిపిలు, మండల కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సిఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -కోడుమూరు

సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం కోడుమూరు నియోజకవర్గం కొడుమూరు టౌన్‌కు చెందిన పూడూరు లక్ష్మీదేవి కి రూ.162000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. చెక్కును అందుకున్న బాధితులు సిఎం నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి , కెడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు,రేపు సిఐటియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేటర్

ఈనెల 25, 26 తేదీలలో కర్నూల్ నగరం కార్మిక కర్షకభవన్‌లో జరుగు సిఐటియు 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కోరారు. 12వ జిల్లా మహాసభలు 2022 అక్టోబర్ 30,31 తేదీలలో ఎమ్మిగనూరు పట్టణంలో జరిగా యన్నారు. గత మూడు సంవత్సరాల కాలంలో సిఐటియు నాయకత్వంలో జరిగిన పోరాటాలను సమీక్ష చేసుకొని భవిష్యత్తులో కార్మికుల ఉద్యోగుల సమస్యలపై చేయవలసిన ఆందోళన రూపొందించు కొనుటకు రెండు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా 250 మంది ప్రతినిధులు పాల్గొని చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నూలు మాజీ శాసనసభ్యులు ఎంఎ గఫూర్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు సిఐటియు రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. గత మూడు సంవత్సరాల కాలంలో సిఐటియు అనేక పోరాటాలు నిర్వహిం చిందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్ల సమస్యల పైన 42 రోజులపాటు ఆందోళన చేసిందన్నారు. అంగన్వాడి రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా 42 రోజుల పాటు సమ్మెను కర్నూలు జిల్లాలో విజయవంతం చేశామన్నారు. మెడికల్ రంగంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలను ప్రమోట్ చేయాలని నిరంతరం ఉద్యమాలు చేయడం ద్వారా 175 మందిని ప్రమోషన్ ఇప్పించారు. గవర్నమెంట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పైన, మార్కెట్ యార్డులో పని చేస్తున్న కార్మికుల సమస్యల పైన ఆటో కార్మికుల సమస్యల పైన మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పైన కాంట్రాక్ట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల, ఆశా ఆశ వర్కర్ల సమస్యల పైన ఆందోళన చేసి అనేక విజయాలు సాధించామన్నారు. మెప్మా రంగంలో పనిచేస్తున్న ఆర్‌పిల సమస్యలపై పోరాటం చేసి కాలపరిమితి సర్కులర్ రద్దు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం కోసం కృషి చేయడం జరిగిందని తెలిపారు. గతంలో జరిగిన ఉద్యమాలను గతంలో సమీక్షించుకొని రాబోవు కాలంలో పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభలను కార్మిక వర్గం పాల్గొ ని జయప్రదం చేయాలని కోరారు

ఓటర్లకు సౌకర్యంగా పోలింగ్ కేంద్రాలు

-అదనంగా 60 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
-కర్నూలు నియోజకవర్గ ఆర్ఒ విశ్వనాథ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నియోజకవర్గంలో ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అందరికీ అందుబాటులో ఉండేలా అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కర్నూలు నియోజకవర్గంలో ఇప్పటికీ ఉన్న 258 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 60 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూపొందించిన ప్రతిపాదనలపై రిటర్నింగ్ అధికారి విశ్వనాథ్ చర్చించారు. గతంలో ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఒక్కో పోలింగ్ బూత్‌లో 1200 మంది వరకు ఓటర్లు ఉండేలా చూసుకొని అధికారులు, బిఎల్ఒలు సంయుక్తంగా 60 పోలింగ్ బూత్‌లను గుర్తించామన్నారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 27 లోపు తెలియజేయాలని సూచించారు. అందరి ఆమోదంతోనే ఎన్నికల సంఘానికి నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులు సమావేశంలో రిటర్నింగ్ అధికారి విశ్వనాథ్



అన్ని క్యాంటీన్లను సందర్శించిన కమిషనర్ విశ్వనాథ్

అన్న క్యాంటీన్లను పకడ్బందీగా నిర్వహించాలి

నగరంలోని అన్న క్యాంటీన్లను పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్‌లో భోజన నాణ్యత, పరిశుభ్రత, బరువు, తదితర అంశాలను సమీక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అన్న క్యాంటీన్లపై ఫిర్యాదులను రానియొద్దని, ప్రజలు సంతృప్తి చెందే విధంగా సేవలు అందించాలని సూచించారు. పర్యవేక్షక నోడల్ అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ గాయత్రీ ఎస్టేట్ కూడలి వద్ద కుదింపునకు ప్రతిపాదనలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. రహదారి విస్తరణ, ట్రాఫిక్ సౌకర్యం, భద్రతా అంశాలపై అధికారులు చర్చించారు. కుదింపు ప్రక్రియలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇ మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌టియు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి

టెట్ పై రివ్యూ పిటిషన్ వేయాలి

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇన్ సర్వీస్ టీచర్లు అందరూ టెట్ ఉతీర్ణత పొందాలన్న సుప్రీం కోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం జాప్యం లేకుండా రివ్యూ పిటిషన్ వేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూల్ లోని ఎస్‌టియు భవన్‌లో ఎస్‌టియు జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ 2010 ముందు నియమించిన ఇన్ సర్వీస్ టీచర్లు (రిటైర్ మెంట్‌కు ఐదేళ్లు సర్వీస్ ఉన్నవారు తప్ప) అందరూ వృత్తి పరమైన విద్యార్హతతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణులైన వారేనని పేర్కొన్నారు. 2010 కన్నా ముందు నియామకం అయిన వారిని టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వెంటనే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయడంతో పాటు పార్లమెంట్లో విద్యా హక్కు చట్టం సవరణకు కృషి చేయాలని కోరారు.ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ నాయకులు జోసెఫ్ సుధీర్ బాబు, శన్మూర్తి, మాజీ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి , ప్రధాన కార్యదర్శి టికె.జనార్ధన్, ప్రసాద్ రెడ్డి అజీమ్ బెగ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని వాసవి హాస్పిటల్ అధినేతలు డాక్టర్లు వై.రమణ మల్లీశ్వరిలు పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న వీరాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని వాసవి అపెక్స్ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ రమణ డాక్టర్ మల్లీశ్వరిలు ప్రారంభించారు. ముందుగా ఆలయంలో వారికి ఆలయ ఇఒ దినేష్ పూజారి ప్రత్యేక పూజలను నిర్వహించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్నదానం కార్యక్రమం ఎంతో గొప్పదానం అన్నారు. తమ ఆసుపత్రిలో నిరుపేదలకు ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గోశాల మాజీ కమిటీ సభ్యులు శ్రీకాంత్ మాజీ ఎంపిటిసి రఘునాథ్ రెడ్డి, శ్రీరాములు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

- 27, 28న సచివాలయాల ముందు ధర్నా


- వ్యకాస అధ్యక్ష, జిల్లా ప్రధాన కార్యదర్శులు వీరశేఖర్, నారాయణ

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి పెండింగ్ వేత నాలు చెల్లించాలని ఈనెల 27, 28వ తేదీల్లో జిల్లావ్యాప్తంగా సచివాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తు న్నట్లు వ్యకాస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వీరశేఖర్, కెవి.నారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక సిఐటియు భవన్‌లో వ్యకాస సమావేశం వీరశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో జిల్లా పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో వలసలు మొదలయ్యాయని, వలసల నివారణకు ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈఏడాది అతివృష్టి వల్ల పంటల దిగుబడి అరకొరగా ఉందని తెలిపారు. వృద్ధులను ఇంటి వద్ద వదిలి చదువుకునే విద్యార్థులను కూడా వలస తీసుకెళ్తున్నారని చెప్పారు. అవసరమైన గ్రామాల్లో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలకు పైగా ఉన్న ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, ఈ.తిక్కన్న, బి.బాలకృష్ణ, బి.నాగన్న, జిల్లా కమిటీ సభ్యులు గోపాల్, రంగరాజు, దేవేంద్ర, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, నరసింహులు, బజారి, దరగయ్య, నరసన్న, భుజలు, శిఖామణి పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత : ఎంపిపి అమ్రేష్

ప్రజాశక్తి - కౌతాళం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అమ్రేష్

ప్రజారోగ్యం కోసం మండలంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిపి అమ్రేష్ తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఎంపిపి అమ్రేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాలు బాగా కురుస్తుండడంతో వివిధ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టి, స్వచ్ఛమైన నీరందించాలని తెలిపారు. పొదలకుంట ఎంపిటిసి ముక్కన్న మాట్లాడుతూ... రైతుల పట్టా ల్యాండ్ రెవెన్యూ రికార్డుల్లో ఇనాం భూములుగా చూపుతోందని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... చాలా గ్రామాల్లో ఈ సమస్యను పరిష్కరించినట్లు, కొన్ని గ్రామాల్లో అలాగే ఉందని, త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రధానమంత్రి గృహాల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ సిబ్బంది శ్రీనివాసులు కోరారు. గతంలో నిర్మించుకున్న గృహాలకు బిల్లులు పూర్తిగా రాలేదని తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్ ప్రశ్నించగా, సర్వే పూర్తి చేశామని, త్వరలో ఆ బిల్లులు కూడా అందేలా కృషి చేస్తామని తెలిపారు. వైస్ ఎంపిపిలు బుజ్జి స్వామి, లిఖిత రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, కౌతాళం, బదినేహాల్ సొసైటీ అధ్యక్షులు వెంకటపతి రాజు, మారెప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంత డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరు ఎంపిడిఒ మద్దిలేటి స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారని, సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుని తాగాల్సిన దుస్థితి వచ్చిందని తెలిపారు. ప్రజలకు తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాగునీటి సమస్య పట్ల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నా కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు మైనా, షాకీర్, ఈరన్న, షేకున్‌బీ, రాధమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

నిలిచిన వర్షపు నీరు..!

- వెదజల్లుతున్న దుర్గంధం
- బీసీ కాలనీ సమస్యకు రాజకీయ గ్రహణం
- తొలగని కుటుంబాల అవస్థలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామం బీసీ కాలనీలో వర్షపు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. గత 20 ఏళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఎప్పుడు కురిసినా కాలనీలో నీరు నిలిచి వాగులను తలపిస్తుంది.



వాగును తలపిస్తున్న కాలనీ

గ్రామం మధ్యలో ఉన్న బీసీ కాలనీలో ఒక వైపు రామలింగేశ్వరస్వామి ఆలయం, మరో వైపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. దీనివల్ల ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. స్వామి వారి దర్శనార్థమై వచ్చిన గ్రామస్తులకు, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు, కాలనీ వాసులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామంలో ఈ కాలనీ పల్లపు ప్రాంతంలో ఉండడంతో వాటర్ ట్యాంకు వృథా నీరు, వర్షపు నీరు, పై భాగంలో ఉన్న కాలనీ వాసుల వృథా నీరు ఇక్కడ చేరుతోంది. కలుషితమైన నీరు నిలిచి దుర్వాసన రావడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది కాలనీ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. మురుగునీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. సమస్య వల్ల కాలనీలో ఉన్న సుమారు వంద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

20 ఏళ్లుగా నిర్లక్ష్యం

- కాలనీ యువకులు మంగళి నరేష్, మంగళి రంగముని, మహిళ సరోజమ్మ, గురుస్వామి, రంగయ్య

ఈ సమస్య పరిష్కారానికి సిసి రోడ్డు, డ్రెయినేజీ కాలువలు నిర్మించాలని గత 20 ఏళ్లుగా ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసికెళ్లినా నిర్లక్ష్యం చేస్తున్నారు. రాజకీయ కక్షల కారణంగానే స్థానిక నాయకుల చెప్పుచేతల్లో ఉంటున్న నియోజకవర్గ నేతలు కూడా సమస్యను విస్మరించారు. పంచాయతీ కార్యదర్శులు నాయకుల కనుసన్నల్లో పని చేయడం వల్లే పారిశుధ్య లోపం కనిపిస్తోంది.



నరేష్, రంగముని

ఒక వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర అంటూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉంది. మరో వైపు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదే సమస్యపై ఈనెల 6న జిల్లా పంచాయతీ అధికారికి సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదు చేశాం. త్వరలో సంబంధించిన సమస్య అధికారులు మిమ్మల్ని సంప్రదిస్తారని చెప్పారు. 20 రోజులైనా ఎవరూ కూడా రాలేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆరెకల్ రామకృష్ణ

హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రామకృష్ణ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎపి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఆదోని మండలం ఆరెకల్ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఆరెకల్ రామకృష్ణ శుక్రవారం విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ తాతయ్య బాబు, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సమక్షంలో రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. తనకు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, టిడిపి ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, ఎమ్మెల్సీ బీటీ.నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, రంగస్వామి నాయుడు పాల్గొన్నారు.

'శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి'

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని బాపురం మజరా గ్రామమైన పచార్లపల్లిలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సిపిఎం నాయకులు కోరారు. శుక్రవారం బాపురం సచివాలయ అధికారికి సిపిఎం నాయకులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడారు. గ్రామంలో శ్మశాన వాటిక, సిమెంటు రోడ్లు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేదని, వెంటనే నిర్మించాలని కోరారు. రంజన్, నాగరాజు, గాది, అశోక్ పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాలకే 'కూటమి' ప్రాధాన్యత

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

స్వార్థ ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకం రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్ విమర్శించారు. మెడికల్ కళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం వైసిపి కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్య విద్య పేద విద్యార్థులకు కూడా అందాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పిపిపి విధానాన్ని అమలు చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్టా అని తెలిపారు. అధికార పార్టీ నాయకులు పోలీసుల సహాయంతో వైసిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎవరూ భయపడే పరిస్థితిలో లేరని చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసిపి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గెలుపోటములు సర్వసాధారణమని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కోటి సంతకాల సేకరణ గోడపత్రికను విడుదల చేశారు. అంతకుముందు బుడగ జంగాల కాలనీలో డ్రెయినేజీ, గ్రావెల్ రోడ్డుకు భూమి పూజ చేశారు. శ్రీబసవేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. వైసిపి సీనియర్ నాయకులు దాట్ల కృష్ణంరాజు, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, సర్పంచి పాల్ దినకరన్, నాయకులు సుధాకర్ రెడ్డి, రామన్న గౌడ్, హాల్వి బసవ ప్రభు, తోవి నర్సప్ప, గురునాథ్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, లక్ష్మి కాంత్ రెడ్డి, ముదేగౌడ్, శివరాం, అనిల్, రామస్వామి, లింగన్న గౌడ్ పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - మంత్రాలయం : భక్తుల సౌకర్యాలకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మిగనూరు, మంత్రాలయం రహదారిలో శివరాం బ్రదర్స్ ఆధ్వర్యంలో బంగారు బాబు నూతనంగా నిర్మించిన బిఎంఆర్ రెసిడెన్సీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన భక్తులకు మెరుగైన సేవలందించాలని కోరారు. డాక్టర్ల విభాగం అధ్యక్షులు దశరథరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, లాడ్జీ యజమాని బంగారు బాబు, చిన్న రెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

స్థానిక రామచంద్ర నగర్ కాలనీలోని సిఎస్ఐ చర్చిలో జరిగిన వివాహ వేడుకలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి పెద్దల ఆహ్వానం మేరకు పాల్గొన్న ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన వధూవరులు దివ్య, దేవరాజును ఆశీర్వదించారు. చెట్నిహళ్లి ఉప సర్పంచి వీరనాగప్ప, నాయకులు మారెప్ప, డేవిడ్, ఏబు, శేఖర్ ఉన్నారు.



కౌతాళంలో కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న బాలనాగిరెడ్డి



బిఎంఆర్ రెసిడెన్సీని ప్రారంభిస్తున్న బాలనాగిరెడ్డి

విద్యుత్ స్మార్ట్ మీటర్ మాయ..!

- రూ.వేలల్లో బిల్లు

ప్రజాశక్తి - ఆదోని

స్మార్ట్ మీటర్ వద్దని చెప్పినా వినకుండా టార్గెట్ నెపంతో విద్యుత్ ఉద్యోగులు మీటర్లు అమర్చారు. రూ.వందల్లో వచ్చే నెలవారీ బిల్లు స్మార్ట్ మీటర్ల వల్ల రూ.వేలల్లో వస్తోందని, చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని బాధితులు వాపోతున్నారు. సరిజేయాల్సిన అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యం చేయడం వల్ల ఆర్థిక భారం మోయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని శివశంకర్ నగర్‌కు చెందిన మోహన్ రావు అనే వ్యక్తి చిన్న వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. గతంలో రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు ప్రతినెలా విద్యుత్ బిల్లు వచ్చేదని, ప్రస్తుతం ఎక్కువగా వస్తోందని వాపోయారు. విద్యుత్ సర్వీస్ నెంబర్ 56485కు ఆగస్టులో స్మార్ట్ మీటర్ బిగించారని తెలిపారు. ప్రతినెలా రూ.9 వేల బిల్లు వస్తుండగా సెప్టెంబర్‌లో రూ.17 వేల పైచిలుక వచ్చిందన్నారు. వర్షాల కారణంగా మోటార్లు కూడా పనిచేయలేదని, ఈనెల బిల్లు రూ.33,456 నమోదయిందని సెల్‌కు మెసేజ్ వచ్చిందని తెలిపారు. ట్రిపుల్ ఫేస్ రెండు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. ఈ మొత్తం బిల్లు ఎలా వస్తుందని విద్యుత్ అధికారులను అడిగితే పొంతన లేని సమాధానం చెబుతూ ఇంకా ఎక్కువ వస్తుందని భయపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కెపాసిటర్లు సరిచూసుకోండని ఉచిత సలహా ఇస్తున్నారని తెలిపారు. ఇదే విషయంపై విద్యుత్ శాఖ అడిషనల్ డిప్యూటీ ఇంజినీర్ పురుషోత్తంను వివరణ కోరగా... కెపాసిటర్లు



బాధితుడు మోహన్ రావు

ఆన్‌లో ఉంటే వృథా పవర్ కూడా రికార్డు అవుతుందని, బిల్లు పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అప్పుడప్పుడు గమనిస్తూ ఉండాలని చెప్పారు. సిబ్బందిని పంపి బిల్లు ఎలా ఎక్కువ వచ్చిందో తెలుసుకుంటామని తెలిపారు. మీటరు జంప్ ఉంటే టెస్టింగ్‌కు పంపుతామని చెప్పారు. ఒకసారి బిల్లు వచ్చిన మొత్తాన్ని వినియోగదారుడు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న నాయకులు

సిఐటియు మండల మహాసభ

- నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద పంచాయతీ కార్యాలంలో సిఐటియు మండల 5వ మహాసభ శుక్రవారం రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణస్వామి హాజరయి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలని, కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. అనంతరం 16 మందితో సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రామాంజనేయులు, నాగరాజు, గౌరవ సలహాదారులుగా వెంకటేష్, సహాయ కార్యదర్శిగా మల్లయ్య, పరిమళ, సరస్వతి, ఉపాధ్యక్షులుగా నాగరాజు, సలోని, గంగన్న, కమిటీ సభ్యులుగా ఉలిగయ్య, వీరేష్, గురుపాద, నగేష్, సిద్ధలింగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విధులకు సకాలంలో హాజరు కావాలి


- పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

విధులను బాధ్యతగా చేపట్టాలని, సకాలంలో విధులకు హాజరు కావాలని పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి తెల్లబండ్ల భీమయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయం 1, 2, 3 పరిధిలో ఉన్న కాలనీల్లోని వీధుల్లో తిరిగి విద్యుద్దీపాలు, తాగునీటి సమస్య, రోడ్లు, ఇతర సమస్యలపై నిఘా ఉంచి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజలకు సేవలందించి గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు. సచివాలయాల సిబ్బంది శ్రీనివాసులు, భవానీ, అఖిల, నాగేశ్వరమ్మ, సౌజన్య, గోవిందు, సుజాత, హేమంత్, వీరేంద్ర, హసీనా, హరీష్, షహీనాజ్ బేగం, కవిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి

ప్రజాశక్తి-ఆలూరు



ఎస్‌జిఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆలూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని పి.ఐషమ్మ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కె.రేఖామణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని పి.ఐషమ్మ వాలీబాల్ క్రీడల్లో మండల, జిల్లా స్థాయిలో రాణించారని తెలిపారు. ఈనెల 23న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన పోటల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 27 నుంచి 30 వరకు వెస్ట్ గోదావరి జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, ప్రతాప్, ఎంపికైన క్రీడాకారిణిని ప్రిన్సిపల్ అభినందించారు. ఉపాధ్యాయులు రాజేంద్ర, మల్లికార్జున, మల్లీశ్వరి, లిఖిత, సుగుణ, రంగమ్మ, సంగీత, మెర్రి ఫ్లోరెన్సీ, రమాదేవి, విజయ కుమారి, పరమేష్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అంపయ్య కుటుంబాన్ని ఆదుకున్న సిబ్బంది

ప్రజాశక్తి - చిప్పగిరి

అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ అంపయ్య కుటుంబాన్ని సిబ్బంది ఆదుకుంది. శుక్రవారం క్లస్టర్ ఏపీడీ పకీరప్ప ఆధ్వర్యంలో ఏపీవోలు, ఇసిఒలు, టిఎలు, సిఒలు, ఎఫ్ఎలు కలిసి దాదాపు రూ.60 వేలను మృతుడు అంపయ్య కుటుంబానికి అందజేశారు. అంపయ్య భార్యకు చిన్న ఉద్యోగమైన వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరారు. పిల్లలందరూ చిన్నగా ఉన్నారని, చదువుకోవడానికి కూడా స్తోమత లేదని, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నతాధికారులకు తెలిపి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

క్యాన్సర్ పట్ల అవగాహన అవసరం

-వైద్యులు మిథిలేష్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

చాప కింద నీరులా వ్యాప్తిస్తున్న క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యులు మిథిలేష్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదోనిలోని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిజీషియన్ డాక్టర్ మిథిలేష్ కుమార్, డాక్టర్ శివరాజు మాట్లాడారు. మానవ జీవనశైలిలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్లాస్టిక్ వాడకం పెరగడం, మారుతున్న ఆహారపు అలవాట్ల ప్రభావం మానవ శరీరంపై చూపుతోందన్నారు. ఏమాత్రం అనుమానం ఉన్నా వైద్యుల సలహాలను పాటించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే క్యాన్సర్ వ్యాధి లోలోన వ్యాప్తి చెంది ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఐఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జీ, వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ వ్యాధిని గుర్తించి మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రతాప్ ఈరన్న శెట్టి, నగరగంటి వెంకటేష్ బాబు, ఐఐఎఫ్ నేషనల్ ఛైర్మన్ డాక్టర్ శివరాజ్, కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ బాషా, లెక్చరర్ డాక్టర్ సలోమీ, విద్యార్థులు ఉన్నారు.

ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి

- వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి - దేవనకొండ

అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు, ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి జె.సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలవ్యాప్తంగా పి.కోటకొండ, తెర్నేకల్, కరివేముల, దేవనకొండ సచివాలయాల ముందు వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో కురిసిన అధిక వర్షాల కారణంగా రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రూ.వేలకు వేలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఉల్లి, పత్తి, కంది, ఆముదం, టమోటా తదితర పంటలు సాగు చేస్తే అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.90 వేల వరకు పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేసిన రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల పంట పొలాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా రైతులతో కలిసి సోమవారం రాజకీయ పార్టీలకతీతంగా భారీ ర్యాలీ, అనంతరం వ్యవసాయ, తహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు అశోక్, సూరి, మాబాష, సుధాకర్, సుభాన్, శేఖర్, వీరాంజి, రామాంజి, జె.హరిశ్చంద్ర, నరసింహులు, రషీద్, కె.భాస్కర్, మాబాష, మద్దిలేటి, రాజు, మాదన్న, రాజేష్, గిడ్డయ్య, బాషా పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీరశేఖర్

నిట్రవట్టి వాగుకు నీరు

- రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలో నిట్రవట్టి గ్రామానికి వెళ్లే వాగుకు నీరు రావడంతో హాలహర్వి నుంచి నిట్రవట్టి, విరుపాపురం, బిలేహాళ్, బోలగొట, కుర్లహల్లి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు, ఉపాధ్యాయులు, ఆస్పత్రికి వెళ్లేవారు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అత్యవసర సమయంలో వాగు దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై వంతెన నిర్మించాలని అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఉపాధ్యాయులు గ్రామానికి రావాలంటే ఇబ్బంది పడుతున్నారు.



నాణ్యమైన మద్యం అందించేందుకు చర్యలు

- టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ

ప్రజాశక్తి - నందవరం

నాణ్యమైన మద్యాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని టిడిపి మండల అధ్యక్షులు ఖాసీం వలీ తెలిపారు. మండలంలోని ముగతి గ్రామంలో ఉన్న 'స్టార్ వైన్స్'ను టిడిపి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం అమ్మకాల్లో అవినీతి జరగకుండా, ప్రజల ఆరోగ్యాలు రక్షించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం 'ఎపి ఎక్సైజ్ సురక్ష' యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. మద్యం సేవించే ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ యాప్ ద్వారా మద్యం నాణ్యమైనదేనా, కల్తీ ఉందా అన్న విషయాన్ని తెలుసుకోవచ్చని సూచించారు. ఈ యాప్ ద్వారా బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే నెంబరు, తయారు తేదీ చూపిస్తుందని తెలిపారు. అనంతరం వారు షాపులో బాటిళ్లను యాప్ ద్వారా పరిశీలించారు. యాప్‌ను ఉపయోగించి మద్యం కొనుగోలుదారులు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఎక్సైజ్ ఎస్ఐలు ఇస్మాయిల్, రాముడు సూచించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న రాముడు, సొసైటీ ఛైర్మన్ ధర్మపురం గోపాల్, మండల కార్యదర్శి లచ్చప్ప, మార్కెట్ యార్డు డైరెక్టర్ దావీదు, టిడిపి హాలహర్వి అధ్యక్షులు ఎర్రన్న, మాజీ సర్పంచి దాస్, రాయచోటి రామకృష్ణారెడ్డి, కైరవాడి వీరేష్, సోమన్న, బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని జివిఆర్ వైన్స్‌ను టిడిపి నాయకులు సందర్శించారు. కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం అంటూ వస్తున్న విమర్శలు అవాస్తవమని, బాటిళ్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మద్యం వివరాలు చూపిస్తూ వైసిపి నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు తెలిపారు. టౌన్ ప్రెసిడెంట్ మహల్ రహమతుల్లా, నాయకులు నజీర్ సాహెబ్, పూజారి చంద్రశేఖర్, అచ్చుగట్ల హుస్సేన్, శ్రీధర్ నాయుడు, కైరవాడి రాజేష్ నాయుడు, రాంపురం రఫీ పాల్గొన్నారు.



నందవరంలో వైన్ షాపును సందర్శిస్తున్న నాయకులు



గోనెగండ్లలో వైన్ షాపును సందర్శిస్తున్న నాయకులు







హైదరాబాద్‌లో ఇలా బయలు దేరింది- చిన్నటేకూరు వద్ద ఇలా కాలింది- 19 మంది దహన మయ్యాక చివరికి ఇలా మిగిలింది

మృత్యు ప్రయాణం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వేకువజామున శుక్రవారం 3-15 గంటలకు నిద్రలో ఉన్నవారిపై మృత్యువు నిప్పల రూపంలో విరుచుకుపడిన హృదయవిదారక ఘటనా స్థలం అది. కర్నూలు సమీపంలో జరిగిన వేమూరి కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదం మొత్తం ప్రాంతాన్ని భీతావహ వాతావరణంలో ముంచెత్తింది. హైదరాబాద్-బెంగళూరు 44వ జాతీయ రహదారి పక్కన కాలి బూడిదైన ఆ బస్సు - కేవలం ఇనుప అస్థిపంజరంలా మిగిలిపోయింది. మంటల ఉధతికి నిస్సత్తువగా వంగిపోయిన దాని ఆకారం, లోపల జరిగిన ఘోరాన్ని చెప్పకనే చెబుతోంది. ప్రమాదం జరిగిన సమయంలో 40 మందికి పైగా ప్రయాణికులతో నిండిన ఆ బస్సులో 19 మంది నిద్రలోనే అగ్నికి ఆహుతయ్యారు. కాలిపోయిన వస్తువులు, భయానకమైన దృశ్యాలు ఆ ప్రాంతమంతా వ్యాపించాయి.

ప్రమాదం జరిగిన విషయం తెలిసి చేరుకున్న బంధువుల రోదనలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తమ ప్రియమైన వారిని క్షణాల్లోనే కోల్పోయిన ఆ తల్లిదండ్రులు, పిల్లలు, భార్యాభర్తలు.. ఆ పీడకల లాంటి వాస్తవాన్ని నమ్మలేక కన్నీరు మున్నీరు అవుతున్నారు. 'అమ్మా... నాన్నా... ఎక్కడున్నావు?' అంటూ ఎగసిపడుతున్న ఆర్తనాదాలు, గుండెలను పిండేసే విలాపాలు.. చూసేవారిని కూడా కదిలించాయి. చనిపోయిన వారి శరీరాలు పూర్తిగా కాలిపోవడంతో ఎవరి సమాచారం దొరకక, తమ వారి ఆచూకీ కోసం భస్మమైన బస్సు చుట్టూ వెతుకుతూ, ఆశ-నిరాశల మధ్య ఊగిసలాడుతూ అల్లాడారు. భయంకరమైన ప్రమాదం నుంచి తప్పించుకున్న కొద్దిమంది ప్రయాణికులు.. కాలిన గాయాలతో, నిస్సత్తువతో, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసిన ఆ క్షణాలను తలచుకొని వణికిపోతున్నారు. అంధకారంలో, మంటల మధ్య సహాయం కోసం వారేసిన కేకలు... ఇంకా గాలిలో ప్రతిధ్వనిస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఈ ఘోర ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్లు మాత్రం తప్పించుకోవడం, చనిపోయిన వారి బంధువుల ఆగ్రహాన్ని, ఆవేదనను మరింత పెంచుతోంది. ఈ దుర్ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.



సంఘటనా స్థలంలో కాలిన బస్సును పరిశీలిస్తున్న హోంమంత్రి , డిజిపి



కాలిపోయి మాంసపు ముద్దలయి మిగిలిన మృతదేహాలు



ప్రాణాలతో బయటపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, కలెక్టర్ డాక్టర్ సిరి



ప్రమాద స్థలంలో నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి



కర్నూలులో మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి వి.అనిత



రోడ్డుపై ప్రమాదంలో కాలిపోయిన ట్రావెల్స్ బస్సును పక్కకు తరలించబోయిన క్రేన్ బోల్తా పడిన దృశ్యం , డ్రైవర్‌కు స్వల్ప గాయాలు